ఎడతెరపి లేని వర్షం

- మంగళవారం రాత్రి నుంచి అదే తీరు
- రోడ్లు జలమయం
- ఇళ్లల్లోంచి బయటికి రాని ప్రజానీకం
- మూసీలో పెరిగిన వరద ప్రవాహం


ఎన్జీఓఎస్ కాలనీ ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు


గొడుగు రక్షణలో.. బాలికలు


పెద్దఅంబర్‌పేట్ లక్ష్మారెడ్డి పాలెంలో కురుస్తున్న వర్షం


గాంధీనగర్‌లో ఉప్పొంగిన మ్యాన్‌హోల్

చాదర్‌ఘాట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న రోడ్లు జలమయమయ్యాయి. మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, చంపాపేట, కర్మన్‌ఘాట్, మన్సూరాబాద్, నాగోల్ తదితర ప్రాంతాలలోని ప్రధాన రోడ్లతో పాటు లోతట్టు ప్రాంతాలది ఇదే పరిస్థితి. మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద జీహెచ్ఎంసీ, హైడ్రా సిబ్బంది మోటారు ద్వారా వరద నివారణకు పంపింగ్ చేయిస్తున్నారు. న్యూ మలక్‌పేట మెట్రో స్టేషన్, అక్షయ్ హోటల్ వద్ద మ్యాన్‌హోల్ మూతలను తెరచి ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బారికేడ్లను ఏర్పాటు చేశారు.

● హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో మూసీలో వరద ప్రవాహం పెరిగింది. చాదర్‌ఘాట్ కాజ్ వే బ్రిడ్జి కింద మూసీ ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఉదయం నుంచి పరివాహక ప్రాంత నివాసులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 డీసీ ఎంకేఐ అలీతో కూడిన బృందం పర్యటించి వరద నివారణకు చర్యలు చేపట్టింది.

హయత్‌నగర్: హయత్‌నగర్, తుర్కయంజాల్ పరిసర ప్రాంతాలలోని లోతటుట్ట ప్రాంతాలు జలమయం అయ్యాయి. హయత్‌నగర్‌లోని బాతుల చెరువు, కుమ్మరి కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. బాతుల చెరువు అలుగు నీరు రోడ్డుపై నుంచి పారుతోంది. వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి ప్రాంతాల నుంచి వరద నీరు సామనగర్ మీదుగా కుమ్మరికుంటకు చేరుతోంది. తుర్కయంజాల్ పై ప్రాంతాల నుంచి వచ్చే వరదతో పెద్ద ఎత్తున అలుగు నీరు కిందకు వెళ్తోంది. మంగళవారం రాత్రి నుంచి ముసురు కురుస్తుండడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

అబ్దుల్లాపూర్‌మెట్: హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్ మెట్, దాని అనుబంధ గ్రామాలు తడిసిముద్దయ్యాయి. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. బాటసింగారంలో ఉపయోగంలోని లేని పాత సత్రం మట్టి గోడలు కూలిపోయాయి. పక్కనున్న పులి పలుకుల యాదయ్య ఇంటి మెట్లపై పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

● అకాల వర్షాలతో శివారులోని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి కోతకొచ్చింది. కొన్ని చోట్లా కోతలు ప్రారంభించారు. తుఫాన్ వల్ల రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. వరి నెలకొరుగుతుందని తెలిపారు.

చంపాపేట : చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లలో పలు రహదారులు వరదతో జలమయం అయ్యాయి. ప్రజలు బయటకు రాలేదు.

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని గాంధీనగర్, స్నేహమాయినగర్, పీవీఆర్ కాలనీ, పద్మావతి నగర్, మహలక్ష్మీకాలనీ, అఖిలాండేశ్వరీ నగర్, మైల్‌స్టోన్, గాయత్రినగర్ ఫేస్-1,2,3,4, భవాని ఎంక్లేవ్, జక్కిడి రామస్వామి నగర్ కాలనీలు, వనస్థలిపురంలోని ఆటోసాయినగర్, ఎఫ్‌సీఐ కాలనీ ప్రధాన రహదారి, హైకోర్టుకాలనీ, శారదానగర్, గౌతమినగర్‌తో పాటు పలు కాలనీలు జలమయం అయ్యాయి. కాలనీవాసుల ఫిర్యాదులతో హైడ్రా, జీహెచ్ఎంసీ బృందాలు రంగంలోకి దిగి వరద తరలింపు చర్యలు చేపడుతున్నారు.

'అక్రమ నిర్మాణాలు చేపడితే ఊరుకోం'

మన్సూరాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు, పార్కుల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చూస్తూ ఊరుకోమని హయత్‌నగర్ సర్కిల్ సహాయ పట్టణ ప్రణాళిక అధికారి విజయలక్ష్మి హెచ్చరించారు. నాగోల్ డివిజన్ జైపురికాలనీ సమీపంలో ఉన్న శ్రీసాయినారాయణ కాలనీ రోడ్ నంబర్.2లో గల పార్కు స్థలంలో అక్రమ షెడ్డు నిర్మాణాన్ని కూల్చివేశారు. ఇది అక్రమ నిర్మాణమని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన ఆదేశాల మేరకు జయలక్ష్మి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు మధ్య దాన్ని కూలగొట్టారు.

కార్తీక పౌర్ణమి మహోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ

చంపాపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలో బుధవారం కార్తీక పౌర్ణమి మహోత్సవ బ్రోచర్ ఆవిష్కరించారు. ఇందులో ఆలయ చైర్మన్ ఈదులకంటి సత్యానారాయణరెడ్డి, జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఏ.చంద్రశేఖర్, ధర్మకర్తలు పాల్గొన్నారు. నవంబరు 5న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయంలో తెల్లవారుజాము 4:15గంటలకే విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు చైర్మన్ తెలిపారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను టీజీ క్యాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, టీజీ క్యాబ్ ఎండీ వైకే రావు, మహబుబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, నల్లగొండ డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిలు సన్మానించారు. బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.
-హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి


మర్యాదపూర్వక కలయిక

దాడి చేసిన వారిపై కేసు

చంపాపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అకారణంగా వ్యక్తిపై దాడి చేసిన వారిపై కోర్టు ఆదేశాల మేరకు కంచన్‌బాగ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హాఫీజ్‌బాబానగర్‌కు చెందిన సయ్యద్ హాషం ఇబ్రహీం(48)ఈ నెల 20న సాయంత్రం తన ఇంటి స్థలంలో బోరు వేయిస్తున్నాడు. ఈ స్థలం తమదని సయ్యద్ హాషం ఇబ్రహీంతో గొడవ పడి యూసుఫ్‌గూడకు చెందిన సయ్యద్ రియాజ్ ఖాద్రీ(47), సయ్యద్ మోహిత్ ఖాద్రీ(45), జిషన్ ఖాద్రీ(28), సయ్యద్ అబీబ్ ఖాద్రీ(38) దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పై నలుగురిపై కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు కమల్‌కుమార్ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

చాదర్‌ఘాట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సమత తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 99592 26137 నంబర్ ద్వారా అవసరమైన సలహాలు, సూచనలు, ఫిర్యాదులు చేయొచ్చని విజ్ఞప్తి చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

చంపాపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం హుండీ (111 రోజులకు గాను) ఆదాయం రూ.36.92 లక్షలు చేకూరిందని ఆలయ ఈవో ఎన్.లావణ్య బుధవారం పేర్కొన్నారు. నగదుతో పాటు 63 యూఎస్ డాలర్లు, 30 యూకే పౌండ్లు, 35 అరబ్ దిర్హాంస్, 10 సౌది రియాల్స్ కూడా వచ్చాయని తెలిపారు.

కుంగిన సీసీ రోడ్డు పరిశీలన

హయత్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి పద్మావతి కాలనీలో ఉన్న సీసీ రోడ్డు కుంగగా.. బుధవారం రాత్రి 7 గంటలకు జలమండలి, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి సమాచారం అందించారు. ఆయన ఇక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రాంతంలో ఎవరు కూడా సంచరించకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

● ఓవర్ టేక్ చేస్తుండగా..



మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తుండగా.. బుధవారం ఉదయం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. హయత్‌నగర్ డిపోకు చెందిన 204 ఆర్టీసీ బస్సు 15 మంది ప్రయాణికులతో అనాజ్‌పూర్ నుంచి కోహెడ మీదుగా ఉమెస్‌కాలేజ్‌కు బయలుదేరింది. గండిచెరువు గ్రామానికి వెళ్లే రోడ్డు వద్ద మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తుండగా బస్సు రోడ్డు దిగి పక్కనున్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది.
- అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి